క్లుప్తంగా

వనరుల వినియోగంపై సదస్సు



గుంటూరు రూరల్: వనరుల వినియోగం, సమస్యలు, అవకాశాలు సద్వినియోగించుకునే అంశాలపై బాపట్ల వ్యవసాయ కళాశాల రావెప్ విద్యార్థుల ఆధ్వర్యంలో రైతు అవగాహన సదస్సును శనివారం జొన్నలగడ్డ గ్రామంలో నిర్వహించారు. ఎక్స్‌టెన్షన్‌లో ఉపయోగించే పార్టిసిపేటరీ రూరల్ అప్రైజల్ టెక్నిక్స్ అనే కార్యక్రమంలో రైతులకు భూమిలో లభించే వనరులు, వాటి వినియోగాలపై వివరించారు. భూమిలో లభించే వనరుల పటాలు, వెన్ రేఖాచిత్రాలు, గ్రామ సామాజిక పటాన్ని గీసి రైతులకు వివరించారు. కార్యక్రమంలో రైతులు వంగా నవీన్‌రెడ్డి, గ్రామంలోని రైతులు, పెద్దలు పాల్గొన్నారు.

బాలకృష్ణవి దిగజారుడు వ్యాఖ్యలు

వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు చాబాసు ఈశ్వరయ్య

పొన్నూరు: అసెంబ్లీ సమావేశాల్లో ప్రముఖ నటుడు చిరంజీవిపై, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు సరికాదని, మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తిలా హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ మాటలు ఉన్నాయని వైఎస్సార్ సీపీ మండల దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు చాబాసు ఈశ్వరయ్య, వైద్య విభాగం అధ్యక్షుడు మామిళ్లపల్లి వెంకట మోహనరావులు శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రజాదరణ ఉన్న వారి పట్ల అమర్యాదగా వ్యవహరించడం తగదన్నారు. బాలకృష్ణ చేసిన అసత్య ఆరోపణలను చిరంజీవి ఖండించడాన్ని ప్రజలంతా స్వాగతిస్తున్నారన్నారు. బాలకృష్ణ అసభ్యకరమైన మాటలు తీవ్ర అభ్యంతరకరమని అన్నారు. అధికారం అండతో ఇష్టానుసారంగా మాట్లాడితే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

జీఎస్టీ తగ్గింపుతో వ్యాపారులకు మేలు



నెహ్రూనగర్: జీఎస్టీ తగ్గింపు నిర్ణయం వల్ల వ్యాపారులతో పాటు వినియోగదారులకు ఎంతో మేలు జరుగుతుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. అదనపు కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి శనివారం పాత గుంటూరులోని పలు దుకాణాలను సందర్శించారు. జీఎస్టీ తగ్గింపుపై వివరాలు అడిగారు. ప్రజలకు తగ్గింపుతోనే విక్రయాలు చేయాలని వ్యాపారులకు సూచించారు. అధిక ధర వసూలు చేయడానికి వీల్లేదని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించని షాపులపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. వార్డుల వారీగా ప్రజలకు తగ్గిన జీఎస్టీపై కరపత్రాల ద్వారా అవగాహన కలిగిస్తున్నామని కమిషనర్ తెలిపారు.

జీజీహెచ్‌లో ఎమ్మార్పీఎస్ నేతల ఆందోళన



గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో శనివారం ఎమ్మార్పీఎస్ నేతలు ఆందోళన చేశారు. ఆసుపత్రిలో కాంట్రాక్టు ఈసీజీ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న నాగరాజును ఉద్యోగం నుంచి తొలగించిన విధానం సరైనది కాదని, తక్షణమే తిరిగి విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ కార్యాలయం నుంచి ఆందోళనకారుల వద్దకు వచ్చి హామీ ఇచ్చే వరకు నినాదాలు చేస్తూనే ఉన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ జరిగిందని, నివేదికను ఆయనకు అందజేశామని డాక్టర్ యశశ్వి రమణ తెలిపారు. తిరిగి విచారణ కమిటీ నియమించాలని కలెక్టర్‌ను కోరతామని, లిఖిత పూర్వకంగా డిమాండ్లను ఇవ్వాలని ఆయన సూచించారు. ఈ మేరకు ఎమ్మార్పీఎస్ నేతలు సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు.



పొన్నూరు కోదండ రామాలయంలో..



పొన్నూరు షిరిడీ సాయి మందిరంలో..



మధురమీనాక్షిగా చల్లావారి పాలెం పుట్లలమ్మతల్లి



నారాకోడూరు వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ..

లలితా త్రిపుర సుందరీ.. నమోస్తుతే..!



మంచాలలో మహాలక్ష్మీదేవీగా ఆదిలక్ష్మి కామేశ్వరి..

పొన్నూరు, ప్రత్తిపాడు నియోజకవర్గాల వ్యాప్తంగా శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం పలు ఆలయాలల్లో అమ్మవారు శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

– పొన్నూరు/గుంటూరు రూరల్/ చేబ్రోలు

నవయుగ కవిచక్రవర్తి గుర్రం జాషువా



జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నినాదాలు చేస్తున్న రమేష్ బాబు



పెదకాకానిలో గుర్రం జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు

కాకుమాను: నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా అని విజ్ఞాన కేంద్రం అధ్యక్షుడు దొప్పలపూడి రమేష్ బాబు అన్నారు. పెదనందిపాడు తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో శనివారం గుర్రం జాషువా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ జాషువా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని వినుకొండలో జన్మించారని ఆయన తెలిపారు. కుల వివక్ష, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా తన రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పించారన్నారు. ముఖ్యంగా ఆయన రచించిన గబ్బిలం, ఫిరదౌసి, క్రీస్తు చరిత్ర వంటి అనేక రచనలు ప్రసిద్ధి చెందాయన్నారు. 1964వ సంవత్సరంలో శాసన మండలి సభ్యుడిగా పనిచేసి కేంద్ర ప్రభుత్వంచే పద్మ భూషణ్ అవార్డుతో గౌరవం పొందినట్లు ఆయన తెలిపారు. అసమానతలు లేని సమాజం కోసం ఆయన చేసిన కృషిని మనమందరం కొనసాగించాలని ఆయన కోరారు. ఈసందర్భంగా జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రామారావు, వెంకట శివరావు, వెంకటేశ్వర్లు, వెంకట సుబ్బారావు, భువనేశ్వరి, లక్ష్మి, షేక్ షమీ, తదితరులు ఉన్నారు.

పెదకాకానిలో...

పెదకాకాని: నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా సాహిత్యాన్ని విస్తృతంగా ప్రజలలోకి తీసుకువెళ్లాలని జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు ఆకాంక్షించారు. గుర్రం జాషువా జయంతిని పురస్కరించుకొని శనివారం మండల కేంద్రమైన పెదకాకాని సుందరయ్య కాలనీలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ జాషువా తన జీవితాంతం సమాజ అభ్యున్నతి కోసం, మూఢనమ్మకాలు, కుల వివక్షత, అంటరానితనం, మహిళలపై అత్యాచారాలకు వ్యతిరేకంగా తన కలాన్ని, గళాన్ని ఎక్కుపెట్టారన్నారు. తన నిజ జీవితంలో కుల వివక్షతను అంటరానితనాన్ని ఎదుర్కొన్నారని, దానికి వ్యతిరేకంగానే పోరాటాలు చేశారన్నారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చి 70 సంవత్సరాలు దాటినా నేటికీ సామాజిక అసమానతలు కొనసాగుతూనే ఉన్నాయని వీటికి వ్యతిరేకంగా ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించడమే జాషువాకు ఇచ్చే నిజమైన ఘన నివాళి అన్నారు. సీపీఎం నాయకులు ఎం.శ్రీనివాసరావు, కె.రాఘవయ్య, బి.సాంబయ్య, జి.రాజా రమేష్, కె.సత్యనారాయణ, నీలాంబరం, సుందరయ్య కాలనీ వాసులు పాల్గొన్నారు.

మానసిక శక్తిని పెంచే సాధనం చెస్

- ఈగల్ ఐజీ రవికృష్ణ
- విజ్ఞాన్‌లో కొనసాగుతున్న 62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈగల్ ఐజీ రవికృష్ణ

చేబ్రోలు: చెస్ అనేది మానవ చరిత్రలో అత్యుత్తమమైన ఆటల్లో ఒకటని, ఇది కేవలం వినోదం మాత్రమే కాకుండా, మానసిక శక్తిని పెంచే సాధనమని ఈగల్ (ఎలైట్ యాంటీ–నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) ఐజీ ఏకేఈ రవికృష్ణ అన్నారు. ఆలిండియా చెస్ ఫెడరేషన్ విభాగంలోని ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సహకారంతో చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో జరుగుతున్న '62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు' ఘనంగా కొనసాగుతున్నాయి. ఏడో రోజు శనివారం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శాప్ చైర్మన్ అనిమి రవినాయుడు ముందుగా ఈగల్ ఐజీ ఏకేఈ రవికృష్ణతో ఒక ఎత్తు వేసి ఆటలను ప్రారంభించారు. శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం పాఠశాలల్లో విద్యార్థులకు సెల్ఫ్ సపోర్టింగ్‌లో భాగంగా కరాటే తరగతులను ఎలా నిర్వహిస్తున్నామో అలాగే చెస్‌ను కూడా ప్రతి పాఠశాలలో భాగం చేయాలనుకుంటున్నామన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడారు.

ఉత్కంఠభరితంగా పోటీలు..

62వ జాతీయ చెస్ చాంపియన్‌షిప్ ఆరో రౌండ్ తర్వాత పోటీ మరింత ఆసక్తికరంగా మారింది. పెట్రోలియం స్పోర్ట్స్ ప్రామోషన్ బోర్డుకి చెందిన గ్రాండ్‌మాస్టర్ శశికిరణ్ కృష్ణన్, రైల్వే స్పోర్ట్స్ ప్రామోషన్ బోర్డుకి చెందిన అరోణ్యక్ ఘోష్, మాజీ జాతీయ చాంపియన్ అభిజీత్ గుప్తా, కేవలం 15 ఏళ్ల ఎలెక్ట్ అజయ్ సంతోష్ పర్వతరెడ్డి (ఉత్తరప్రదేశ్), నలుగురు ఐదున్నర పాయింట్లతో జట్టుగా అగ్రస్థానంలో నిలిచారు. శశి–అరోణ్యక్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. సేతురామన్ ఒడిశా ఆటగాడు శ్రియాంశ్ దాస్‌పై జయభేరి మోగించాడు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



అంగన్ వాడీ కార్యకర్తలు తయారు చేసిన ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న డాక్టర్ రాజశేఖర్, వెంకాయమ్మ



మహిళలు, గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మేరీ యూనిస్

కాకుమాను: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని గర్భిణులు, బాలింతలు తప్పని సరిగా మంచి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని కాకుమాను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ రాజశేఖర్ అన్నారు. పోషణ మహా మాసోత్సవాలు కార్యక్రమంలో భాగంగా స్థానిక శ్రీ చెన్నకేశ స్వామి దేవస్థాన కల్యాణ మండపంలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషక ఆహారం వలన కలిగే ప్రయోజనాల గురించి గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ గర్భిణి సమయంలో పోషకాహారం తీసుకుంటేనే తల్లి, శిశువు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఆయన తెలిపారు. ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి మాట్లాడుతూ ఇంటి వద్దనే లభించే ఆహార పదార్థాలతో మంచి పోషక విలువలు ఉండే ఆహారాన్ని ఎలా తయారు చేసుకోవాలో వివరించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన న్యూట్రీషియన్ ఫుడ్‌ను పరిశీలించారు. కాకుమాను సెక్టార్ సూపర్‌వైజర్ వెంకాయమ్మ, కార్యకర్తలు, ఆయాలు, తల్లులు పాల్గొన్నారు.

రక్తహీనతను అధిగమించాలి

ప్రత్తిపాడు: తల్లీబిడ్డలు రక్తహీనతను అధిగమించడం ద్వారా మాతాశిశు మరణాలను అరికట్టవచ్చని గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మేరి యూనిస్ అన్నారు. ప్రత్తిపాడు మండలం యనమదల హెచ్‌ఈ ప్రాథమిక పాఠశాల ఆవరణలో శనివారం స్వస్థ్ నారీ, స్వశక్త్ పరివార్ కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. హాజరైన డాక్టర్ మేరి యూనిస్ మహిళలు, కిశోర బాలికలకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం మాట్లాడుతూ మహిళలు అసంక్రమిత వ్యాధుల బారిన పడుతున్న నేపథ్యంలో నివారించేందుకు ప్రభుత్వం పదిహేను రోజుల పాటు ప్రత్యేక స్క్రీనింగ్‌ను చేపడుతుందన్నారు. రక్తపోటు, మధుమేహం పట్ల ఎలాంటి పరిస్థితుల్లోనూ అలసత్వం వహించవద్దన్నారు. కిశోర బాలికలకు యుక్తవయస్సులో వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. అనంతరం మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, సర్పంచ్ ఆదినారాయణ, ఉప సర్పంచ్ మాధవరావు, ఎంపీహెచ్‌ఈఓ చెల్లమ్మ, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కాఫీ అవుట్‌లెట్ల ఏర్పాటుకు రుణాల మంజూరు

నెహ్రూనగర్: అరకు కాఫీ అవుట్‌లెట్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ రుణాలు అందిస్తోందని డీఆర్‌డీఏ పీడీ టి.వి.విజయలక్ష్మి పేర్కొన్నారు. శనివారం ఆసక్తి గల లబ్ధిదారులతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, రద్దీ ప్రదేశాల్లో అరకు కాఫీ అవుట్‌లెట్లు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌డీపీఎం డాక్టర్ టి.అశోక్‌కుమార్, నెటీవ్ అరకు కాఫీ సీఈఓ రామ్‌కుమార్ వర్మ పాల్గొన్నారు.

భయమెరుగని విప్లవ వీరుడు భగత్ సింగ్



ఏఎన్‌యూలోని భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

పెదకాకాని(ఏఎన్‌యు): భారత్‌లో బ్రిటీషు పాలనను వ్యతిరేకిస్తూ విప్లవాత్మక ఉద్యమాలను చేపట్టిన భారత స్వాతంత్య్ర సమర యోధుడు ప్రఖ్యాత ఉద్యమకారుడు భగత్‌సింగ్ అని వర్సిటీ ఏఐఎస్‌ఎఫ్ శాఖ అధ్యక్షుడు కృష్ణాంజనేయులు కొనియాడారు. విప్లవ వీరుడు భగత్‌సింగ్ జయంతి సందర్భంగా శనివారం మంగళగిరి పట్టణంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి గుడి దగ్గర ఉన్న భగత్‌సింగ్ విగ్రహానికి, ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో గల భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాలెం నాసరయ్య మాట్లాడుతూ యావత్ భరత జాతిలో పోరాట స్ఫూర్తిని రగిలించిన భయమెరుగని విప్లవ యోధుడు షహీద్ భగత్‌సింగ్‌ను అశేష భారత జాతి కొనియాడిందన్నారు. ఆయన ఆత్మబలం, త్యాగస్ఫూర్తి ఎల్లప్పుడూ ప్రేరణగా నిలుస్తుందన్నారు. దేశ స్వాతంత్య్రం కోసం 23 ఏళ్ల వయసులోనే ప్రాణ త్యాగం చేసిన భగత్ సింగ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఏఐఎస్‌ఎఫ్ ప్రధాన కార్యదర్శి అఖిల్, కోశాధికారి వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు చుట్టూ ఫెన్సింగ్ నిర్మించరూ..

ఎంపీడీఓ, తహసీల్దార్‌ను కోరిన ప్రత్తిపాడు ఎంఈఓ

ప్రత్తిపాడు: విద్యార్థుల రక్షణ నిమిత్తం పాఠశాల ఎదురుగా ఉన్న చెరువు చుట్టూ ఫెన్సింగ్ నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని ప్రత్తిపాడు ఎంఈఓ సీహెచ్ రమాదేవి మండల అధికారులను కోరారు. ప్రత్తిపాడు పంచాయతీ పరిధిలోని రావిపాటివారిపాలెం ప్రాథమిక పాఠశాల ఎదురు పెద్ద నీటి చెరువు ఉంది. చెరువుకు ఆనుకుని పాఠశాలకు సంబంధించిన మరుగుదొడ్లను కూడా నిర్మించారు. విద్యార్థులు ఇంటర్వెల్ సమయంలోనూ, మరుగుదొడ్లు వినియోగించుకునే సమయంలో చెరువు సమీపంలోనికి వెళ్లాల్సి వస్తుంది. ఆ సమయంలో ఏదైనా పొరబాటు జరిగితే పిల్లల ప్రాణాలకు ప్రమాదం ఉంటుందని ఇటీవల విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు మండల విద్యాశాఖాధికారి దృష్టికి తీసుకువచ్చారు. పాఠశాల ఎదురునున్న చెరువు చుట్టూ రక్షణగా ఫెన్సింగ్ ఏర్పాటు చేయిస్తే పిల్లలకు ఇబ్బంది లేకుండా ఉంటుందని ఎంఈఓను కోరారు. ఈ నేపథ్యంలో శనివారం ఎంఈఓ సీహెచ్. రమాదేవి ఎంపీడీఓ కె.శివపార్వతి, తహసీల్దార్ సుజాతలను కలిసి విద్యార్థుల రక్షణ దృష్ట్యా చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయించేందుకు కృషి చేయాలని లిఖితపూర్వకంగా విన్నవించారు.

గిట్టుబాటు ధరలు కల్పించాలి

పెదకాకాని: లాభసాటి వ్యవసాయం సాగాలంటే ప్రభుత్వం రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య అన్నారు. పెదకాకాని మండలంలో సీపీఐ ఆధ్వర్యంలో శనివారం కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, గుంటూరు ఛానల్(కొత్త కాలువ)ను పరిశీలించారు. ఈ సందర్భంగా పి.జమలయ్య మాట్లాడుతూ కౌలు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చటానికి గిట్టుబాటు ధరలు కల్పించాలని, అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయాన్ని కౌలురైతులకు అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ, పలువురు రైతులు పాల్గొన్నారు.

రేపు చేబ్రోలులో జాబ్‌మేళా

చేబ్రోలు: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ మరియు జిల్లా ఉపాధి కార్యాలయం వారి ఆధ్వర్యంలో చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెప్టెంబర్ 29వ తేదీన జాబ్ మేళా జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఐటీసీ, ఎస్‌బీఐ కార్డ్స్, ఎస్‌కే డిజిటల్స్, టాటా మొదలగు కంపెనీలు హాజరవుతున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నట్లు యువతీ, యువకులు ఉద్యోగ మేళాలో పాల్గొనవలసినదిగా కోరారు.